# పారిశుధ్యానికి పెద్దపీట

## భక్తులకు అసౌకర్యం లేకుండా సేవలు : టిటిడి ఇఓ

తిరుమల, ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడిలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని, ఎక్కడా అపరిశుభ్రంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సిఇ నాగేశ్వరరావు, రవాణా జిఎం శేషారెడ్డి, పిఆర్ఓ నీలిమతో కలసి భక్తులకు అందించాల్సిన సేవలు, పారిశుధ్యం, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన శ్రీలంక రైతులు

కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త



శ్రీలంక దేశానికి చెందిన పదహారు మంది రైతులు సోమవారం కుప్పంలో ప్రకృతి వ్యవసాయ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ పరిధి చీగలపల్లిలో రైతు కృష్ణమూర్తి పొలంలో సమీకృత వ్యవసాయం ఎటిఎం, ఎ గ్రేడ్ విధానంలో కూరగాయల సాగు, ఎన్‌పిఎం షాప్ తదితరా లు పరిశీలించారు. ఈసందర్భంగా డ్వాక్రా మహిళలతో వారు ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపిఎం వాసు, సీనియర్ తమటిక్ లీడ్ చంద్రశేఖర్, సురేంద్ర, శ్రీనివాసులు, డా॥ పుష్ప, యశ్వ ంత్, రాజేష్, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను

# ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయండి

### రాష్ట్ర మంత్రి డా. పి. నారాయణ



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 26, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ, తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, ఎక్కడా నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ అధికారులకు సూచించారు. తిరుపతి నగర పాలక సంస్థ, తుడాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తుడా సమావేశం మందిరంలో సోమవారం మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. మౌర్య తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, చేపట్టనున్న పనులు, నిధుల పెండింగ్ తదితర అంశాలపైన, తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తుడా ఇన్చార్జి విసి వెంకట నారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి నారాయణకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. మనం అందరూ కూడా అభివృద్ధి బాట పట్టాలని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహించానని అన్నారు. ఇక నుండి ముఖ్యమైన మున్సిపాలిటీల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఏమి జరుగుతోంది, అభివృద్ధి ఎలా చేయాలనే అంశాలపై సమీక్షించనున్నానని అన్నారు. నిధుల కొరత ఉందని అనుభవం ఉన్న ముఖ్యమంత్రి కేంద్రం నుండి నిధులు తెచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే నిధులు వస్తాయని అన్నారు. వచ్చిన నిధులను చక్కగా ప్లాన్ చేసుకుని ప్రాధాన్యత క్రమంలో ప్రజా అభివృద్ధి పనులకు వెచ్చించాలని అన్నారు. మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులు చేయాల్సిన అభివృదద్ధి పనులపై ప్లాన్ చేసుకోవాలని అన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిఆర్ బాండ్ల దుర్వినియోగం జరిగిందన్నారు. నగరంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని, శెట్టిపల్లి భూముల సమస్యను పరిష్కరించాలని, భూగర్భ డ్రైనేజి వ్యవస్థను పునరిద్దరించాలని, భూగర్భ డ్రైనేజి వ్యవస్థను పునరిద్దరించాలని, ఆటో నగర్ అభివృద్ధి చేయాలని, నగరంలో ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తుడా ద్వారా నిధులు దుర్వినియోగం జరిగిందని విచారణ చేపట్టాలని కోరారు. నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశించామని, అభివృద్ధి పనులకు నిధులు ఇస్తామని మంత్రి చెప్పారు. నగర పాలక సంస్థ, తుడా అధికారులు పాల్గొన్నారు.

# వేడుకగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### -ఇస్కాన్ కమలమందిరంలో హరేకృష్ణ నామంతో భక్తుల తన్మయత్వం





తిరుపతి, ఆగస్టు 26ప్రభాతవార్త:

ద్వాపరయుగంలో సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడు జన్మించిన అష్టమి రోజును కలియుగంలో శ్రీకృష్ణజన్మాష్టమిగా భక్తిప్రపత్తులతో ప్రజలు జరుపుకుంటున్నారు. పుణ్యక్షేత్రం తిరుపతిలోని హరేరామహరేకృష్ణ మార్గంలో ఇంటర్నేషల్ శ్రీకృష్ణమందిరం(కమలమందిరం, ఇస్కాన్)లో సోమవారం వేడుకగా కృష్ణజయంతి వేడుకలు నిర్వహించారు. ఇస్కాన్ నిర్వాహకులు రేవతీరమణదాస్, రూపేష్‌ప్రభు వేకువ జామున 3గంటలకు రుక్మిణీసత్యభామసమేత శ్రీకృష్ణుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ఇస్కాన్‌లో భక్తులు దర్శనం చేసుకున్నారు. వివిఐపిలకు ముందుగానే ఆలయ నిర్వాహకులు సమయనిర్దశిత పాసులు జారీచేసి దర్శనం సమయం కేటాయించడంతో సామాన్యభక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు. భక్తులకు ఆలయంలోపల స్వామివారి ప్రసాదాలు అందజేశారు. భక్తులు హరేకృష్ణ...కృష్ణకృష్ణ హరేహరే నామంతో ఆలయం ప్రతిధ్వనించింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుటుంబం, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, నగరపాలక కమిషనర్ మౌర్య ఇతర ప్రముఖులు శ్రీకృష్ణభగవానుడి ఆశీస్సు లందుకున్నారు.

# వినాయక చవితికి సిద్ధమైన గణనాథులు

## భారీగా వినాయకుడు విగ్రహాలు తయారీ



వెంకటగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త

సెప్టెంబర్ నెల 7వ తేది జరగబోవు వినాయక చవితికి గణనాథుని బొమ్మలను వ్యాపారులు సిద్ధం చేస్తున్నారు. పలు రకాల రంగులతో అందర్ని ఆకట్టుకునే విధంగా వినాయకుడి విగ్రహాలను తయారు చేసి సిద్ధం చేశారు. రాజస్థాన్‌కు చెందిన విగ్రహాలను తయారు చేసి సిద్ధం చేశారు. రాజస్థాన్‌కు చెందిన విగ్రహాల తయారీదారులు వెంకటగిరిలోని సాయిబాబా ఆశ్రమం వద్ద విగ్రహాలను తయారు చేస్తున్నారు. పలు రకాల రంగులతో వినాయకుడు విగ్రహాలను తయారు చేశారు. 5000 రూపాయిలు నుండి 30 వేల రూపాయలు వరకు వినాయకుడు బొమ్మలను సిద్ధం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వినాయకుడు విగ్రహాలను తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో మూడు చోట్ల వినాయకుడు విగ్రహాలను తయారు చేస్తున్నారు. కొబ్బరి పీచు ప్యాస్టర్ ఆఫ్ పారిస్‌తో వినాయకుడి విగ్రహాలు తయారు చేస్తున్నారు. శివపార్వతులు, నందీశ్వరుడు, మూషిక వాహనంపై కూర్చున్న వినాయకుడు వంటి అనేక రకాలుగా తయారు చేశారు. అందర్నీ ఆకట్టుకునే విధంగా వినాయకుడు విగ్రహాలు సిద్ధమయ్యాయి.

# బంగారు కుప్పం స్థాపనే సిఎం ధ్యేయం

### కుప్పంలో 900కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు ..

### డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌కు స్థల సేకరణ !- ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గాన్ని బంగారు కుప్పంగా చేయడమే సిఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో జూప్లెంట్ అనే సంస్థ సుమారు 800-900 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు ము ందుకు వచ్చిందని వారు సుమారు నలభై ఎకరాల భూములు కోరారని త్వరలోనే అధికారులు భూముల కేటాయింపు చేస్తారన్నారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సు మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు కూడా కుప్పంలో యూనిట్ల ఏర్పాటుకు ముందుకువస్తున్నాయన్నారు. కుప్పం నియోజకవర్గంలో 500 ఎకరాల్లో మెగాఫుడ్ పార్క్, 500 ఎకరాల్లో ఆటోమొబైల్ యూనిట్లు, మరో 500 ఎకరాల్లో ప్రత్యేక ఆర్థికమండలి (సెజ్) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను అధికారులు భూముల పరిశీలన చేస్తున్నారన్నారు. కుప్పంలో గతంలో పేర్కొన్న విధంగా కార్గోతో పాటు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. దీంతో మరో 500-600ఎకరాల భూసేకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలే ఎపిఐఐసి ఛైర్మన్ చెరకూరి శ్రీధర్‌తో సైతం చర్చించామని పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని కోరామన్నారు. కుప్పం మున్సిపాలిటీలో 250కోట్లకు పైబడి అంచనాలతో అభివృద్ధి ప్రతిపాదనలు పంపామని త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. తద్వారా మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైన్లు, రోడ్ల విస్తరణ, మౌలిక వసతులు, పార్కుల అభివృద్ధి చేపడ్తామన్నారు. కుప్పంలో జనవరి కల్లా పరిశ్రమల ఏర్పాటు ప్రారంభానికి సిఎం చంద్రబాబు గడువు విధించారన్నారు. ఏడాదిలోగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో 10కోట్లతో చిన్న చిన్న మరమ్మత్తు పనులు ప్రారంభించామన్నారు. నరేగాలో 20కోట్లతో అంగన్‌వాడీకేంద్రాలు, డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు.

#### మా పేర్లు చెప్పి దందాలు చేస్తే చొక్కా పట్టుకు నిలదీయండి

కుప్పం నియోజకవర్గంలో ఎవరైనా తమ పేర్లు చెప్పి అక్రమ దందాలు, వసూళ్లకు పాల్పడితే వారిని ప్రజలు చొక్కాపట్టుకు నిలదీయాలని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఇప్పటికే సిఎం చంద్రబాబునాయుడు హెచ్చరించి ఉన్నారన్నారు. తమ పేర్లు చెప్పి తమ పార్టీ వారు తప్పులకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, జగన్, నేతలు మంజు, చెక్కునత్తం మణి, వల్లెప్ప, వినోద్, శ్యాంసుందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో 22కిలోల

# గంజాయి స్వాధీనం

### -ఇద్దరు యువకులు అరెస్టు



తిరుపతి, ఆగస్ట్ 26ప్రభాతవార్త:

తిరుపతినగరంలో అక్రమంగా నిల్వవుంచి విక్రయాలకు సిద్ధమైన 22కిలోల గంజాయి సంచులను అలిపిరి పోలీసులు పట్టుకున్నారు. ఈగంజాయి సంచులను కలిగి వున్న చిత్తూరుజిల్లా సదుం మండలం యర్రాతివారిపల్లికి చెందిన పట్టాభి గుణశేఖర్(20), ఏర్పేడు మండలం మన్నసముద్రంకు చెందిన కొండా మునిభరణి(20)లు గంజాయి సంచులను కలిగిఉన్నారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుకు అందిన సమాచారంతో అదనపు ఎస్పీ నాగభూషణరావు, ఈస్టు డిఎస్పీ వెంకటనారాయణ, ఆదేశాలతో అలిపిరి సిఐ రామ్‌కిశోర్ తమ సిబ్బందితో కెటిరోడ్డులో ఇద్దరిని పట్టుకున్నారు. వారినుండి 22కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని చిన్నచిన్న పొట్లాలుగా చేసి నగరంలో యువతకు విక్రయించేవారని తెలిపారు. పట్టుబడిన నిందితులపై గతంలోపై సెబ్‌స్టేషన్‌లో పాతకేసులు ఉన్నట్లు డిఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం ముద్దాయిలను అరెస్టుచేసి ,కోర్టులో హాజరుపరిచినట్లు సిఐ రామ్‌కిశోర్ తెలిపారు.

# శ్రీవారి ఆశీస్సులకు విశ్రాంత సిజెఐ జస్టిస్ రమణ



తిరుమల, ఆగస్ట్ 26ప్రభాతవార్తప్రతినిధి:

సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతిఅతిథిగృహం వద్ద ఆయనకు టిటిడి వసతికల్పన ఓఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## కన్నులపండువగా

# శ్రీకృష్ణుడికి పుష్పయాగం

### -పురవీధుల్లో శ్రీకృష్ణుని దర్శనం



శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణుడికి వేదమంత్రోర్ఛరణలతో పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పట్టణానికి సమీపంలోని చెంచులక్ష్మికాలనీలో అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణాలయంలో అష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం విశిష్ట పర్వదినమైన శ్రీకృష్ణజ న్మష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతమైన పుష్పాలతో పుష్పయాగాన్ని శాస్రోక్తంగా చేపట్టారు. ఉభయదాతలు సి.చెంచురత్నంయాదవ్ కుటుంబం స్వామివారి పుష్పయాగానికి 100కిలోల పూలను సమర్పించారు. అర్చకులు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రోర్ఛరణలతో శ్రీకృష్ణున్ని అర్తిస్తూ పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలను స్వామి అర్చనకు వినియోగించారు.

చివరగా తులసీదళంతో స్వామివారిని అర్జించి పుష్పయగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తదనంతరం స్వామివారికి దూప,దీప నైవేద్యాలను శాస్రోక్తంగా సమర్పించారు.చివరగా స్వామివారికి విశిష్టమైన పుర్ణాహరతులను వేదమంత్రోర్ఛరణలతో సమర్పించారు. పట్టణ నలుమూలల నుండి భక్తజనాలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి పుష్పయాగంలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తజనానికి ఆలయం తరపున తీర్థప్రసాదాలను అందించారు అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని పురవీధుల్లో అంగరంగవైభంగా నిర్వహించారు. ఈ పుష్పయాగ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం నాయకులు సి.చెంచురత్నంయాదవ్, విక్రమ్ విద్యాసంస్థల గౌరవాధ్యక్షులు డైరెక్టర్ డాక్టర్.చంద్రశేఖర్, చిన్నారుల కోలాటాలు నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

# ఢీ ఫార్మసీ వైద్యం..విద్యార్థిని దుర్మరణం..!

## ఆర్ఎంపీల వైద్యం. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం.. పట్టించుకోని అధికారులు







మృతి చెందిన తేజశ్రీ (ఫైల్ ఫోటో) మృతదేహంను అంబులెన్స్‌లో తీసుకువచ్చి రోడ్డుపై రోదిస్తున్న తల్లిదండ్రులు

క్లీనిక్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

గంగవరం, ఆగస్టు 26, ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీ వైద్యులు కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యులు చేసే చికిత్సలు అమాయక ప్రజలపైన ఆర్ఎంపీలు ప్రయోగాలు చేయటంతో వారి ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే గ్రామాల్లో సీజనల్ జ్వరాలు మెదలవుతాయి. దీనిని ఆసరాగా చేసుకుని గ్రామాల్లో, పట్టణాల్లోని ఆర్ఎంపీ వైద్యులు వారి వద్దకు వచ్చే అమాయక ప్రజలకు హైడోస్ మందులు, ఇంజక్షన్లు ఇవ్వడంతో పాటు సెలైన్స్ ఎక్కిస్తున్నారు. ఆర్ఎంపీ వైద్యులు హైడోస్ మందులు ఇవ్వడంతో రోగికి వెంటనే రోగం నయమైపోవడంతో వారు అడిగినంత డబ్బు వారికి ఇస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యం వికటించి అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీనిలో భాగంగా పలమనేరు పట్టణం చర్చి వీధిలో ఒక ఢీ ఫార్మసీ నిర్వాహకుడు తెలిసి తెలియని వైద్యం చేయడంతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే తేజశ్రీ(17)అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో మండలంలోని గంగవరం పంచాయతీ నల్లగుట్లపల్లె గ్రామానికి చెందిన జయచంద్ర, నిర్మల దంపతుల ఒక్కగానొక్క కుమార్తె తేజశ్రీకి మూడు రోజుల క్రితం జ్వరం వచ్చిందని పలమనేరు పట్టణం చర్చి వీధిలోని శ్రీనివాస క్లీనిక్‌కు వెళ్ళగా అక్కడ ఢీ ఫార్మసీ వైద్యుడు రాణాప్రతాప్ సెలైన్ బాటిళ్లు ఎక్కించడంతో పాటు హైడోస్ కలిగిన ఇంజక్షన్ ఇవ్వడంతో వైద్యం వికటించి తేజశ్రీని వెంటనే పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్ళాలని ఖర్చు ఎంతైనా తానే భరిస్తానని ఢీ ఫార్మసీ వైద్యుడు చెప్పి తిరుపతి స్విమ్స్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుండి సిఎంసి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి మరీ తీవ్రంగా ఉండడంతో రాణిపేట అపోలోకి తరలించగా చికిత్స పొందుతూ తేజశ్రీ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తేజశ్రీ ఢీ ఫార్మసీ వైద్యుని నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. తేజశ్రీ వారి తల్లిదండ్రులకు ఏకైక సంతానం. వారి తల్లిదండ్రుల కడుపు కోతను ఎవరు తీర్చగలరు. తెలిసి తెలియని వైద్యంతో బంగారు భవిష్యత్తు ఉన్న అమాయక ప్రజల ప్రాణాలను తీస్తున్న ఇలాంటి వైద్యులపై చర్యలు తీసుకునేవారే లేరా అంటూ తేజశ్రీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఆర్ఎంపీలు రోగికి చికిత్స చేసే అధికారం ఎవరు ఇచ్చారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తేజశ్రీ మృతదేహన్ని అంబులెన్స్‌లో పలమనేరు చర్చి వీధిలోని శ్రీనివాస క్లినిక్ వద్ద ఉంచి మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పలమనేరు ఎస్ఐ స్వర్ణతేజ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేసి ఇతర ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాల్సి ఉంటుంది. ఇది ఇలా ఉండగా గ్రామాల్లోని ఆర్ఎంపీలను జిల్లా, పట్టణ కేంద్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పెంచి పోషిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా వైద్యాధికారిణిని 'ప్రభాతవార్త' కోరే ప్రయత్నం చేయగా ఆమె స్పందించకపోవడం కొసమెరెపు.

## మాజీ వైస్ ఛైర్మన్ ఖాదర్‌ఖాన్ మృతి

**పుంగనూరు,ఆగస్టు 26 ప్రభాతవార్త**



మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ పి.ఖాదర్‌ఖాన్ 92 సోమవారం మృతి చెందారు. పంచాయతీ వ్యవస్థ నుంచి సభ్యుడుగా ఉన్న ఖాదర్‌ఖాన్ పలుమార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆయన మున్సిప్ వైస్‌ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. పట్టణంలో సీనియర్ నాయకులలో ఒకరైన ఖాదర్‌ఖాన్ పట్టణాభివృద్ధికి ఎంతో సేవలందించారు. ఆయన మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## మన టిడిపి యాప్ ప్రతిభావంతులకు సిఎం అభినందన లేఖలు

**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మన టిడిపి యాప్ ద్వారా పార్టీకి సంబంధించిన వివిధ కంటెంట్లను అప్‌లోడ్ చేస్తూ ప్రతిభ చూపిన కార్యకర్తలకు సిఎం చంద్రబాబు నాయుడు అభినందన లేఖలను పంపించారు. సోమవారం స్టేట్ టాప్ పెర్ఫార్మర్‌గా కుప్పంకు చెందిన జయప్రకాష్, శ్యాంసుందర్‌తో పాటు మరో పద్నాలుగు మందికి ఈ అభినందన లేఖలను ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్న ం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబులు అందించారు. ఈసందర్భంగా వారి సేవలను కొనియాడారు.

## ఘనంగా నాగదేవతల విగ్రహ ప్రతిష్ట

**సదుం,ఆగస్టు 26 ప్రభాతవార్త**



స్థానిక గార్గేయనది ఒడ్డున వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి ఆలయం పరిసరాల్లో ఉప ఆలయంగా కొత్తగా నాగదేవతల విగ్రహాలను ప్రతిష్టించేందుకు అరుగు నిర్మించారు. అక్కడే వేప చెట్టుకు రాగి చెట్టుకు వివాహం జరిపించారు. ఈ చెట్ల కింద ఏర్పరచిన అరుగులపై సోమవారం తెల్లవారుజామున నాగదేవతల విగ్రహాలను అత్యంత వైభవంగా ప్రతిష్టించారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద వివిధ రకాలైన హోమాలునిర్వహించారు. అనంతరం నాగదేవతలకు ప్రత్యేక అభిషేకాలుచేసి అలంకరణ చేశారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉభయదారులుగా సదుంకు చెందిన యల్లారెడ్డి దంపతులు, నడిగడ్డకు చెందిన నాగభూషణరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయం కమిటీ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, సభ్యులు జాంద్రపేట మల్‌రెడ్డి, మేస్త్రీ రాజన్న,అర్చకులు వెంకటరమణశర్మ తదితరులు పాల్గొన్నారు.

## రామకుప్పంలో బిజెపి సభ్యత్వ నమోదు

**రామకుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త** మండలంలో సెప్టెంబర్ 1తేది నుంచి భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్ కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వాన్ని నమోదు చేయాలన్నారు. ప్రధాని మోడీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటేష్, నేతలు రాజసింహ, ఆంజనేయ, జనార్ధనరెడ్డి, నాగరాజు, ఆనంద్, అప్పస్వామి, కార్తీక్, గంగాచారి, అమరనాథ్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గురజాల చొరవతో దేవాదాయశాఖకు 5 ఎకరాల భూమి



**చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:** చిత్తూరు నగర నడిబొడ్డున ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చొరవ చూపడంతో దేవాదాయ శాఖ 5 ఎకరాల భూమిని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో దీర్ఘకాలంగా నిరుపయోగంగా 5 ఎకరాల భూమి వుండేది. ఈ భూమి నిరుపయోగంగా వుండటంతో ఇక్కడ పశువులు, పందులు మేత మేసేవి. ఆ క్రమంలో ఇటీవల ఆ స్థలంలో ఒక పురాతన దేవాలయం వుందని వెలుగు చూసింది. ఈ క్రమంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు ఈ దేవాలయంను గుర్తించి ఈ విషయంను దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ దేవాలయ స్థలంను స్వాధీనం చేసుకోవడానికి పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ పరిస్థితుల్లో విశ్వహిందు పరిషత్ సభ్యులు ఈ విషయంను నేరుగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. ఈ విషయంపై సత్వరం స్పందించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి సత్వరం దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన దేవాదాయ శాఖ అధికారులు ఒక్క రోజులోనే చిత్తూరు నడిబొడ్డును కోట్ల రూపాయల విలువైన వేవాదాయ శాఖకు చెందిన స్థలంను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో వున్న పురాతన దేవాలయంను దేవాదాయశాఖ అధికారులు పరిశీలించి పునరుద్ధరించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్లెడ్జ్

**చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:** జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకుని సోమవారం జిల్లా క్రీడాప్రాధికారిత సంస్థ అధికారి ఎ.బాలాజీ ఆధ్వర్యంలో చిత్తూరు నగర పరిధిలోని పలు ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్లెడ్జ్ నిర్వహించారు. చిత్తూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, సంజయ్‌గాంధీ నగర్‌లోని ఎపి బిసీ వెల్ఫేర్ హాస్టల్, చిత్తూరు ఐటిఐ సమీపంలోని ఎపి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకులాల్లోని విద్యార్థులకు డిఎస్‌డిఓ ఎ.బాలాజీ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ప్లెడ్జ్ నిర్వహించారు.

## వరదుని ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

**కాణిపాకం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సయిత వరదరాజుల స్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు యాదవ కులస్థులచే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని, పోతురాజు శిలా ఈవిగ్రహాలకు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ఏతో విద్యాసాగర్‌రెడ్డి, కాణిపాకం యాదవసంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పూజలందుకొని కష్టాలు కడతేర్చు సాంబయ్యా...!



**చౌడేపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త** స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరుని ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివారికి, ఆలయ ప్రాంగణంలోని పార్వతీదేవిలకు ప్రత్యేకాభిషేకం, విశేషాలంకరణ నిర్వహించారు. అభిషేక ప్రియుడైన పరమశివుడికి రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. వారికి కళ్యాణమండపంలో మృత్యుంజయేశ్వరస్వామి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## భక్తి శ్రద్ధలతో జన్మాష్టమి వేడుకలు

**సదుం, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మండల పరిధిలోని పలు దేవాలయాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి వారి ఆలయంలోను, కొత్తపల్లెలోని వెంకటేశ్వరస్వామి వారి పాదాలు ఆలయంలోను, బూరగమందలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలోను శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా పలువురు మహిళలు శ్రీకృష్ణుడిని స్తుతిస్తూపాటలు పాడారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.చెరకువారిపల్లె, జోగివారిపల్లె, మార్తువారిపల్లె బూరగమంద, సీఎంగొల్లపల్లె, కంభంవారిపల్లె గొల్లపల్లెల్లో పలువురు గోవులకు పూజలు చేసి ఆహారం తినిపించారు. చిన్నపిల్లలకు చిన్నికృష్ణుని వేషాలువేసి మురిసిపోయారు. నడిగడ్డ మతుకువారిపల్లె శివాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిరాటంకంగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం కల్పించారు.

## పాలేటి గంగమ్మ జాతరకు శ్రీకారం

**సోమల, ఆగస్టు 26, ప్రభాతవార్త**



నెల్లిమంద పాలేటి గంగమ్మ జాతరకు ఆదివారం రాత్రి శ్రీకారం చుట్టారు. 15 రోజుల క్రితం ఓ వర్గం జాతర నిర్వహించగా మరో వర్గం సెప్టెంబర్ 1వ తేది రాత్రి 2వ తేది పగలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెల్లుపల్లిలోని పూజారి పాలేటి ఇంటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి జాతరకు శ్రీకారం చుట్టారు. వారం రోజులు పాటు అమ్మవారిని పలు గ్రామాల్లో ఊరేగిస్తారు. పలు పంచాయితీల్లోని ప్రజలు అమ్మవారిని కులదేవతగా పూజి స్తుండటంతో జాతర భారీ స్థాయిలో జరగనుంది. జాతరకు పక్క మండలాల్లో నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అవకాశం ఉన్నందువల్ల ఎలాంటి ఇబ్బందులు భక్తులకు కలగకుండా కార్యనిర్వాహక సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు.

## ఆరిమాని గంగమ్మకు రూ.30 వేలు విరాళం

**శ్రీరంగరాజపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన ఆరిమాను గంగమ్మ ఆలయ అభివృద్ధికి కడప జిల్లా కడప నగరానికి చెందిన గౌస్ పీర్ 30, 116 రూపాయలు విరాళంగా అందజేశారు. స్థానిక సర్పంచ్ దామోదర్‌నాయుడును సోమవారం కలిసిన గౌస్ పీర్ తమ కుటుంబసభ్యులు ఆరిమాను గంగ మ్మ తల్లిని నిత్యం పూజిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మాగుంట హిమచలపతిరెడ్డి, ఆరిమాకులపల్లి సుబ్రమణ్యం నాయుడు, రిటైర్డ్ టీచర్ జగన్నాధ నాయుడు, తయ్యూరు వెంకటరమణ, ఆలయ ఉద్యోగి మోహన్, ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**చౌడేపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండల వ్యాప్తంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయాన్నే విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిట్రెడ్డిపల్లి వద్దగల హరేరామా హరేకృష్ణా మందిరంలో జరిగిన కార్యక్రమాలతో ఆ ప్రాంతం శ్రీకృష్ణుని నామంతో మార్మోగింది. అంతే కాకుండా పలు గ్రామాల్లో గల ఆలయాల్లో స్వామివారు పూజలందుకొన్నాడు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు

### -మత్తుకు బానిసవుతున్న యువత

### -పట్టించుకోని పోలీసులు

**దొరవారిసత్రం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్న ధృడసంకల్పంలో పనిచేస్తుంటే సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పోలీసుల నిర్లక్ష్యం,పర్యవేక్షణలోపం కారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లుపడుతున్నాయి. సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని కొంతమంది అక్రమార్కులు తమ స్వార్ధప్రయోజనాల కోసం తమిళనాడు,ఇతరప్రాంతాల్లో సేకరించిన గంజాయిని నియోజకవర్గంలో దళారులను ఏర్పాటుచేసుకొని వారిద్వార యువతకు అందిస్తూ మత్తుకు అలవాటుచేస్తూ వారిజీవితాలను చిన్నబిన్నం చేస్తూన్నారు.ముఖ్యంగా నాయుడుపేట-దొరవారిసత్రం మండలాల్లో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.ఇటీవల నాయుడుపేట బీడికాలని సమీపంలో స్వర్ణముఖినది కరకటలపై యువకులు గంజాయి తాగి మంతులో ఒకరిపై మరొక్కరు దాడిచేసి బ్లేడ్‌తో మెడపై తీవ్రంగా గాయపరిచిన పంఘటన తెలిసిందే.అంతేకాకుండ దొరవారిసత్రం మండలంలోని నెల్లబల్లి ధాన్యలక్ష్మి రైస్‌మిల్లులో పనిచేస్తున్న యువకుడు గంజాయి సేవించి మత్తులో ఎనిమిదేళ్ళ పాపపై అత్యాచ్చారంచేసి ఆపై హత్యచేసిన విషయం విదితమే.గంజాయి మాపియా గ్రామకు పాకడంతో యువత మత్తుకు అలవాటుపడుతూ ఘర్షణలకు దిగుతున్నారు. ఇంతజరుగుతున్న పోలీసుల అటువైపు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాదికారులు స్పందించి గంజాయి మాఫియాను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## చిన్న వయస్సులోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి

### :-సీయోన్ గాస్పాల్ మీనిస్ట్రీస్ సభ్యురాలు పి కరుణ

**వెంకటగిరిరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



తల్లి తండ్రులు తమ పిల్లలను చిన్న వయస్సు లోనే మంచి మార్గం వైపు నడిపించడంతోపాటు దేవుని భయంతో పెంచడం వల్ల వారు పెద్దవారు అయిన మంచి ప్రయోజకులుగా ఉంటారని సీయోన్ గాస్పాల్ మీనిస్ట్రీస్ సభ్యురాలు పి కరుణ అన్నారు. సీయోన్ గాస్పాల్ మీనిస్ట్రీస్ అధినేత పాస్టర్ ఎ డెవిడ్ ఆదేశాల మేరకు చింతగుంట రోడ్డు మార్గంలోని సీయోన్ గాస్పాల్ చర్చిలో సండే స్కూల్ చిన్నారులకు ప్రోత్సహక బహుమతులు అందజేయడం జరిగిందని వివరించారు. ఆమె మాట్లాడుతూ చిన్నా పిల్లలకు చిన్నవయస్సు నుంచే దేవుని భయం వల్ల వారు యవ్వనస్తులు అయిన తల్లి తండ్రులను గౌరవించే పిల్లలుగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా యువత చేడు మార్గలను వదలి దేవుని వైపు పయనించడం వల్ల జీవితంలో మంచి ప్రయోజకులు అవుతారని తెలిపారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేసి యేసు క్రీస్తు సందేశం బైబిల్‌లో అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ టిచర్ పి జెస్సీ,పి జాయ్ చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టిఎంఆర్ విద్యాసంస్థల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### - అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

**చిట్టమూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త**



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిట్టమూరు మండలం కొత్తగుంట గ్రామంలో ఉన్న తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి విద్యాసంస్థల్లో వేడుకలు డైరెక్టర్ విజయలక్ష్మి ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధా రణలతో పలువురు చిన్నారులు అలరించారు. ముఖ్యంగా పాఠశాలలోని విద్యార్థులు చేసిన కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే పాఠశాల ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. వీటితో పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాఠశాల డైరెక్టర్ విజయలక్ష్మి శ్రీకృష్ణుడు బోధించిన గీతా సారాంశాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా పాఠశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి మునిమనవడు ప్రత్యేక వేషధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏపీలో పారిశ్రామిక విప్లవం

**కోట, ఆగస్టు 26 ప్రభాతవార్త** రాష్ట్రంలో పారిశ్రామిక సౌరభాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా సెప్టెంబర్ 20న కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం వల్ల ఆశించిన స్థాయిలో పెట్టుబడులు తీసుకురావడంలో విఫలమయ్యారని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు అనువైన పారిశ్రామిక విధానం ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, దీనికోసం ప్రభుత్వం నిబంధనలను సరళీకరించాలని చూస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 10 ఓడ రేవులు, 10 విమానాశ్రయాలు, మెరుగైన రోడ్లు రవాణా, లాజిస్టిక్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగించుకొని పోర్టు ఆధారిత పరిశ్రమలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు తయారీ, అక్వో ఆహారశుద్ధి రంగాల్లో పెట్టుబడులు ఆకర్షణకు అవకాశం ఉందన్నారు. పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రస్తుతం ప్రాజెక్టు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూనే ప్రజలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు.

## పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తల్లిదండ్రుల కమిటీలదే

**కోట, ఆగస్టు 26 ప్రభాతవార్త** పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్కూళ్ల తల్లిదండ్రుల కమిటీ వారు తీయాలని పాఠశాల విద్యాశాఖ యంత్రాంగం సూచించింది. ఇటీవల పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలకు ఎన్నికలు జరిగాయి. ఒక్క కమిటీలో 15 నుంచి 21 మంది వరకు సభ్యులు ఉన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు వారానికి రెండు రోజులు, మిగిలిన రోజుల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులు ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకునే విధంగా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చామని కోట ఎంఇఓ మస్తానయ్య తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత ఉపాధ్యాయులపై పెట్టింది. దీనిపై నాడు పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాప్‌ల భారం తొలగిస్తామని, ఇకమీదట ఉపాధ్యాయులు మరుగుదొడ్ల ఫొటోలు తీయాల్సిన అవసరం లేదని పేర్కొంది.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకులు

**వెంకటగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త**



బంగారుపేట వద్ద ఉన్న శ్రీ కృష్ణ మందిరంలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. రాధాకృష్ణ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కృష్ణాష్టమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని కృష్ణ మందిరాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

## ఉపాధ్యాయ క్రికెట్ టీంకు నగదు బహుమతి

### ప్రజాసంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు మునెయ్య

**వెంకటగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త**



ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని గూడూరు నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ జరుగుతున్న క్రమంలో పొదలకూరు టీమ్ మీద డక్కిలి ఉపాధ్యాయ క్రికెట్ టీమ్ విజయం సాధించిన సందర్భంగా వారిని అభినందిస్తూ ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గద్దల మునెయ్య అభినందించారు. క్రికెట్ పోటీలు జరిగే గ్రౌండ్ దగ్గరికి వచ్చి 2000 రూపాయిలు విరాళం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాల నందు పిల్లలు చదువులుకే పరిమితం కాకుండా వారి టాలెంట్‌ను అన్ని రంగాలలో ప్రతిభ సాధించే దిశగా ఉపాధ్యాయులను ప్రోత్సహించి క్రికెట్ టోర్నమెంట్ పంపిన డక్కిలి మండల విద్యాశాఖాధికారులు కిల్లా వెంకటేశ్వర్లుకి, పిన్నిక జగదీష్ బాబుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయ క్రెడిట్ క్రీడాకారులను ప్రోత్సహించి కెప్టెన్ సాయి కుమార్‌కు 2000 డబ్బులు ఇవ్వడంతో డక్కిలి టిసిఎల్ టీమ్ గద్దల మునెయ్య ధన్యవాదాలు తెలిపారు.

## జై కృష్ణ నినాదాలతో మారుమ్రోగిన మాంబట్టు

**తడ, ఆగస్టు 26, ప్రభాతవార్త**



తడ మండలం మాంబట్టు గ్రామంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ ఉత్సవంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్ధసారధి దంప తులు పాల్గొన్నారు. పాలచ్చురు మో హన్ రావు, శేఖర్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరిం చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్విమ్స్ వైద్యులు కారణి మునస్వామి, మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి, మురళి రెడ్డి, వేనాటి రాజారెడ్డి, జనార్ధన్ రెడ్డి, చిల్లకూరు సురేష్ రెడ్డి, గ్రామ పెద్దలు, యాదవ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**దొరవారిసత్రం ఆగస్టు 26 ప్రభాతవార్త ;** దొరవారిసత్రం మండలంలోని పలుగ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించరు.కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని కృష్ణమందిరాలను ప్రత్యేకంగా అలంకరించారు.గోవులను కృష్ణమందారలకు తీసుకెళ్లి విదిగా పూజలు చేపట్టారు.శ్రీకృష్ణ వేషదారణలో చిన్నపిల్లలు కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్దలతో గోవులకు పూజలు నిర్వహించారు.శ్రీకృష్ణ దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కృష్ణమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.

## స్కూటర్లు ఢీ : ఒకరి మృతి

**వాకాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**



వాకాడు మండలం అందలమాల తూపిలిపాలెం రోడ్డు మార్గంలో స్కూటర్ మరో స్కూటర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు కథనం మేరకు కోట మండలం గూడాలి గ్రామానికి చెందిన ముతేష్ తూపిలిపాలెం బీచ్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో అందల మాల సబ్‌స్టేషన్ వద్ద తూపిలిపాలెం గ్రామానికి చెందిన తులసింగారి పుల్లయ్య తూపిలి పాలెం గ్రామానికి వస్తున్న సమీపంలో రెండు బైక్లు ఢీకొనడంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన పుల్లయ్య భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన పుల్లయ్య చిన్న షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆ కుటుంబం కన్నీరు మునిరయింది.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కుప్పంరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త**



కుప్పంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. స్థానిక గుడుపల్లె రోడ్‌లో ఉన్న శ్రీ కృష్ణా ర్జున ఆలయంలో ఉదయం మూలవిరాట్టు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుప్పం ప్యాలస్ ఎదుట శ్రీఆచార్య ప్రబోధానంద నయోగీశ్వర స్వామి ఆశీస్సులతో ఇందూ జ్ఞాన వేదిక అధ్వర్యంలో శ్రీకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక యాదవ కులస్తుల కార్యాల యంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం తదితరులు హాజరయ్యారు.

**వి.కోట :** వి.కోట మండలంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ వేణుగోపాలసా ్వమి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా పురవీధుల్లో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. రామాపురంలో ఇందూజ్ఞాన వేదికచే జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మారెమ్మకు పొంగళ్లు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని తిరు మంజనం వారి కండ్రిగ గ్రామంలో సోమవారం గ్రామ దేవత మారెమ్మకు ప్రత్యేక పొంగళ్ళను నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో గ్రామదేవతలకు పొంగళ్ళు, జాతరలు నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపధ్యంలో టిఎంవి కండ్రిగ గ్రామంలో పొంగళ్ళను ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి గ్రామానికి చెందిన మహిళలు ఆలయం వద్ద పాలపొంగళ్ళను ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపి అభిషేకాలునిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరిపారు. స్వర్ణముఖి ఒడ్డున వెలసిన టిఎంవి కండ్రిగ గ్రామం వ్యవసాయక ప్రాధాన్యత కల్గిన గ్రామంలో పంటలు బాగా పండాలని మారెమ్మకు పొంగళ్లనిర్వహించారు. ఈ పూజల్లో తెలుగుదేశం నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు మండల తెలుగుదేశం నాయకులు కామేష్‌యాదవ్, లు హాజరుకాగా గ్రామస్తులు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.

## సిఐను సత్కరించిన జడ్‌పిటిసి



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రూరల్ సిఐగా నూతనం గా రవి నాయక్‌ను ప్రభుత్వం నియ మించింది. సోమవారం పోలీసు స్టేషన్లో కొత్తగా బాధ్యతలు స్వీకరిం చిన సిఐను తెలుగుదేశం నాయకులు కలసి అభినందించారు. ఆయన్ను సత్కరించారు. ఈ మేరకు జడ్‌పిటిసి కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు తాటిపర్తి రవీంద్రరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్, పార్టీ నాయకులు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. మండలంలోని 47 పంచాయతీల్లో శాంతి భద్రతలపై సమీక్షించారు.

## రాజీవ్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదం

### -వ్యక్తికి తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ వద్ద ఉన్న జెసిబిని ఓద్విచక్రవాహనదారుడు డీకొట్టడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వ్యక్తి రాజీవ్‌నగర్ వద్దనే చికెన్‌సెంటర్ నడుపుతున్నట్లు సమాచారం. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. ఈఘటనపై ఎలాంటి పిర్యాదు అందలేదని సిఐ వెంకటేశులు తెలిపారు.

## ఆక్స్‌ఫర్డ్‌స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త



పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా చిన్నారులందరు రాధాకృష్ణ గోపికల వేషాలతో ఎంతో అందంగా అలంకరించుకుని వచ్చారు. పాఠశాల ప్రాంగణం రాధాకృష్ణ గోపికలతో ఎంతో ఆహ్లాదకరంగా మారింది. దీనిని పురస్కరించుకుని స్కూల్ కరస్పాం డెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి మాట్లాడుతూ శ్రీకృ ష్ణుని జన్మాష్టమి గురించి చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు గంగజాతర చాటింపు

పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన పిడికల గంగమ్మజాతర చాటింపు కార్యక్రమం మంగళ వారం అర్ధరాత్రి చాటింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు గంగజాతర కమిటీ వారు ఓ ప్రకటన లో తెలిపారు. ఈ చాటింపు కార్యక్రమం ఒక వారం పాటు నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే సెప్టెంబరు 1 నుంచి 3 తేదీ వరకు మూడు రోజుల పాటు గెరిగె ఊరేగింపు కార్యక్రమం కూడా ఉంటుం దని తెలిపారు. తదుపరి బుధవారం ఉదయం గంగమ్మ మండపం వద్ద అమ్మవారిని కొలువు తీర్చే కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. గంగజాతర కమిటీ వారు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

## తప్పిన ప్రమాదం



అలిపిరి లింకుబస్టాండు సమీపంలో రోడ్డుపై మతిస్థిమితంలేని వ్యక్తి ఆత్మహత్యాప్రయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం ఆర్టీసి బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును ఆపివేయడంతో ప్రమాదం తప్పింది.

ప్రభాతవార్త-తిరుపతి

## నేడు గ్రామదేవత ఆరేటమ్మకు పాలాభిషేకం

పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన గ్రామదేవత ఆరేటమ్మకు మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 11 వరకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్సవ మూల స్థానం విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు పైన మండపం నుంచి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

## ఎస్‌వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రిలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

తిరుపతి హెల్త్, ఆగస్టు 26, ప్రభాతవార్త

రుయా ఆసుపత్రిలో కంటి విభాగంలో ఆగస్టు 25వ తేది నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు జాతీయ నేత్ర దాన పక్షోత్స వాలు నిర్వహిస్తున్నట్లు కంటి విభాగాధి పతి డాక్టర్ పిఏఎస్ చలపతి రెడ్డి తెలిపారు. సోమ వారం రోగులకు, వారి తోటి సహాయకులకు అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయండి ఇద్దరు అంధులకు చూపులు ప్రసాదించండి అనే నినాదంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మరణానంతరం మీ కళ్ళు నశించిపోకూడదని అంధుల చూపు కొరకు మరణాంతరం మీ కళ్ళను దానం చేయండి అన్నారు. మరణాంతరం 6 - 8 గంటల వ్యవధిలో నేత్రాలు స్వీకరించబడునన్నారు. మీ నేత్రాలు ఇద్దరి కార్నియా అంధులకు చూపునిస్తుందన్నారు. నేత్రదానం పవిత్రమైన బాధ్యతగా పాటించాలన్నారు. ఈ మహత్రమైన కార్యక్రమాన్ని జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నివారణ కార్యక్రమం కింద, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన అవగాహన కలిగించినట్లయితే ఎంతో మందికి మనము చూపునిచ్చిన వాళ్ళమవుతామని ఇది ఒక దేవుడి వరంలా భావించి ఈ అవగాహన కార్యక్రమాన్ని అందరూ అంది పుచ్చుకొని పది మందికి తెలియపరచినట్లయితే ఎంతో మందికి నేత్రదానానికి ముందు వరసలో నిలబడతారని రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవిప్రభు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగ వైద్యాధికారులు, అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ యూజీ వైద్య విద్యార్ధులు, రోగి సహాయకులు, వైద్య సిబ్బంది, పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల బదిలీల జాతర - రెవెన్యూలో పైరవీల జోరు

కోట, ఆగస్టు 26 ప్రభాతవార్త

సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగుల పైరవీలు జోరందుకున్నాయి. ఎలాగైనా కోరుకున్న స్థానం తెచ్చుకోవడానికి పావులు కదుపుతున్నారు. కొందరు సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. వైసీపీ నేతలతో అంటకాగిన మండల అధికారులు, ఉద్యోగులు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్రంలో అధికారం మార్పిడి తర్వాత ప్రథమంగా సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కీలకమైన 15 శాఖల్లో ప్రధాన బదిలీలకు అనుమ తిచ్చారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో జడ్పి, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:



పుత్తూరు శ్రీనివాస ఆస్పత్రి వెనుక కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని శనివారం స్థానిక పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రుయాకు తరలించారు. రెండు రోజుల పాటు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు వయసు 65 సంవత్సరాలు ఉంటుందని, ఆయన ఒంటిపై తెల్లటి పంచె, చొక్కా ఉందన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకట మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సకల దేవతలకు ఆవాసం గోమాత

### - వెంకటాద్రి యాదవ్



రేణిగుంట, ఆగస్టు 26 ప్రభాతవార్త:

సకల దేవతలకు ఆవాసం గోమాత అని యాదవ హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్, బీజేపీ యువ నాయకులు పూల వెంకటాద్రి యాదవ్ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంటలో అనేక ప్రాంతాల్లో వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో గోమాత పూజలు జరిగాయి. శ్రీకృష్ణునికి అతి ప్రతీకరమైన జంతువు గోవును ప్రత్యేకంగా అలంకరించి గోవును గడప గడపకు తీసుకెళ్లి అందరికి గోమాత దర్శనభాగ్యం కల్పించారు. గోవును పూజిస్తే సర్వదేవతలను ఆరాధించినట్టేనని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా యాదవ నేతలు వెంకటాద్రి యాదవ్, భాస్కర్ యాదవ్, అంబి యాదవ్ తదితరులు గోకులాష్టమి సందర్భంగా అనేక చోట్ల కృష్ణ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## దుష్ట శిక్షణ శిష్ట రక్షణ శ్రీకృష్ణగీతోపదేశం

### ఎంఎల్‌ఏ పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త:



శ్రీకృష్ణ పరమాత్ముడు తన గీతోపదేశంతో అర్జునుడి ద్వారా మానవాళికి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణపై దిశానిర్దేశం చేశారని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ, అరిగెలవారిపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో, చంద్రగిరి ద్వారక నగర్‌లోని కృష్ణ మందిరంలో సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలకు ఎంఎల్‌ఏ ముఖ్య అతిధిగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాటు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని అరిగెలవారిపల్లి కృష్ణమందిరంలో ఎంఎల్‌ఏ భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాధించే పర్వదినం కృష్ణాష్టమి అన్నారు. శ్రీకృష్ణ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ద్వారా గోదానం, సువర్ణదానం చేసిన పుణ్యఫలం లభిస్తుందన్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలలో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో టైల్స్ ఎడ్హెసివ్ ప్రత్యేక ఉత్పత్తులు

తిరుపతి విద్య, ఆగస్టు 26, ప్రభాతవార్త

పిడిలైట్ ఇండస్ట్రీస్ నుండి ప్రముఖ టైల్స్ ఎడ్హెసివ్ బ్రాండ్ అయిన రాప్ తమ కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్ణాటక మార్కెట్లలో అధిక నాణ్యత గల టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల కోసం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి ఈ సదుపాయం తోడ్పడనుందని పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్‌లలో ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తులకు డిమాండ్ పరంగా, టైల్, స్టోన్ ఫిక్సింగ్‌ను ఆధునీకరించాలనే మా లక్ష్యంకు అనుగుణంగా మా కొత్త ప్రాజెక్టు ఉందన్నారు. వినియోగదారులకు మేలైన ఎడ్హెసివ్ పదార్ధాలను అందించడం, తయారీని మార్కెట్‌లకు చేరువ చేయడం మా లక్ష్యం అని అన్నారు. పిడిలైట్ ఇండస్ట్రీస్ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా, జీరో - వేస్ట్ ప్లాంట్‌గా పనిచేస్తుంది. 80 శాతం సౌరశక్తితో నడుస్తుంది, నిర్మాణ రసాయనాల రంగంలో పర్యావరణ అనుకూల తయారీకి కొత్త ప్రయాణాలను ఏర్పరుస్తుంద అన్నారు. అధునాతన ఆటోమేషన్‌తో కూడిన ఈ ప్లాంట్ ఉత్పత్తిలో ఖచ్చితత్వం, స్థిరత్వం, నాణ్యత, సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది. మా ఉత్పత్తులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

విజయపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త:



మండలంలోని పాతార్కాడు, తెల్లగుంట, జగన్నాథపురంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పిల్లలకు శ్రీకృష్ణుని వేషధారణతో ఊరేగించారు. సాయంత్రం గ్రామంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

## శివయ్య సేవలో అతిధులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. అలాగే అతిధులు కూడా హాజరయ్యారు. తెలంగాణ దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత రావు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. కాగా మధ్య ప్రదేశ్(ఇన్‌డోర్) జడ్జి దుప్పాల వెంకటరమణ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. వారికి దక్షిణ గోపురం వద్ద పిఆర్‌ఓ రవి సారధ్యంలో స్వాగతం పలికారు.

## ఎంఎల్‌ఏను మర్యాదపూర్వకంగా కలసిన తెదేపా నాయకులు

తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త



చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నానిని సోమవారం తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో తెదేపా నాయకులు మర్యాదపూర్వకంగాకలిసి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. త్వరలోనే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా అన్న వితరణ

పాకాల, ఆగస్టు 26, ప్రభాతవార్త



పాకాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పెనుమూరు మండలం పోలవరం దగ్గర చిన్న నడింపల్లిలో గల హరే రామ వృద్ధాశ్రమంలో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగిన సందర్భంగా వృద్ధులకు క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేసి వారి ఆశ్రమ అవసరాల కొరకు క్లబ్ సభ్యులు సూరినేని దామోదరం నాయుడు 10,016 రూపాయిలు విరాళంగా అందజేశారు. అలాగే టీఆర్‌సి బట్టల దుకాణం యజమాని టీ. సురేంద్ర బాబు 1,116 రూపాయిలు విలువకలిగిన బెడ్‌షీట్లు, టవల్స్, కిటికీ కర్టన్‌లు ఆశ్రమానికి విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కెఎన్. తులసీరామన్, లయన్స్ క్లబ్‌సభ్యులు దామోదరం నాయుడు, జయరాం నాయుడు, టీ. సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్ట్ 23ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కొత్తూరులో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తిరుపతిరూరల్, ఆగష్టు26 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరులో వెలసిన 'రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ దేవాలయం'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో కృష్ణపక్షం అష్టమి తిధినాడు కృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటారు. కొత్తూరు రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణ ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనానికి అనుమతించారు. అనంతరం కుంకుమార్చన, కళ్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉట్లోత్సవం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణ అష్టమి వేడుకలను ఆలయాలతో పాటు ఇండ్లలోను జరుపుకుంటారు. జన్మాష్టమినాడు వెల్లుల్లి, ఉల్లి, మసాలా పదార్ధాలు భుజించరాదు. మాంసానికి, మద్యానికి దూరంగా ఉంటారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వార్తాల శ్రీనివాస్, వార్తాల శివ యాదవ్, మునస్వామి యాదవ్, వెంకటరామయ్య, చెంచురామయ్య, మురళి, భాస్కర్, ఎంపిటిసి సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేరూరులో గురవారెడ్డి కాంస్య విగ్రహం ఆవిష్కరణ

తిరుపతిరూరల్, ఆగష్టు26 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ పేరూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బచ్చల గురవారెడ్డి కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. పేరూరు అభివృద్దిలో గురవారెడ్డి సేవలు ప్రసంశనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. పేదల బడుగు, బడుగుల అభ్యున్నతికి కూడా కృషి చేసినట్లు తెలిపారు. గురవారెడ్డి సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యుడిగా పేరూరు గ్రామ పంచాయతీ అభివృద్దిలో భాగస్వామ్యం అయ్యారు. గతంలో టిడిపి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్వయాన పేరుతో పిలిచేవారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో కూడా ఎవరి సిఫారస్సు లేకుండా నేరుగా ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి చనువుగా వెళ్ళేవారని తెలిపారు. పేరూరులో గ్రామ పంచాయతీ అభివృద్దిలో గురవారెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారు. సోమవారం గురవారెడ్డి 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## విభూది అలంకరణలో శ్రీ కాలబైరవ స్వామి

నగరి, ఆగస్టు 26 ప్రభాతవార్త:



నగరి పట్టణంలో ఈశ్వర ఆలయంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో విశేష సోమవార అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పాలు, పెరుగు, పంచామృతం, కొబ్బరినీళ్లు, చందనం, పన్నీరు తదితర వాటితో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. కలశాలకు పూజలు నిర్వహించిస్వామివారికి స్వర్ణాభిషేక కలశ తీర్థాలతో అభిషేకం నిర్వహించారు. విశేష సోమవారం అష్టం పూజల సందర్భంగా అధిక సంఖ్యలో ఉపదారులు భక్తులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు విభూది, వివిధ రకాలైన ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్య నిర్వాహక కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

## వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు

పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో శ్రీకృష్ణ మందిరాల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతామందిరంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. నవగ్రహ హోమం, గణపతి హోమం కల్యాణోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి ప్రత్యేక పుష్పాలతో స్వామి, అమ్మవారిని అలంకరించి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## వైభవోపేతంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఏర్పేడు, ఆగస్టు26, ప్రభాతవార్త;

మండలంలోని ఏర్పేడు ఎర్రగుట్టవద్ద వెలసిన శ్రీకృష్ణాల యం, గుండవరాయునిమిట్ట, బండారుపల్లి కృష్ణాశ్రమం లో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం ఆల యాల వద్ద విద్యుత్ దీపాల అలంకరణతో ఆలయాలను సుందరంగా తీర్చి దిద్ది శ్రీకృష్ణగవానునికి అభిషేకాలు నిర్వహించి పూలతో సుందరంగా అలకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు పందరి భజనలు, ఉట్టికొట్టే కార్యక్రమాలను ఆనందోత్సహంతో భక్తులు వేడుకలను జరుపుకున్నారు. బండారుపల్లి, గుండవరాయు నిమిట్ట గ్రామాల్లో శ్రీకృష్ణుని చిత్ర పటాలను ఊరేగింపు చేశా రు. ఈసందర్భంగా భజన గురువు కటారి గురవయ్య ఆధ్వ ర్యం లో భజనలు నిర్వహించారు. సర్పంచి బాల గురునాధం యాదవ్, మాజీ ఎంపిటీసి లత, నాయకులు మూర్తి, చంద్రశేఖర్ యాదవ్, సుబ్రమణ్యం తదితర భక్తులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, **KATLAPODI ALLABAKASH**, (old Name) R/o, D.No.3-495-10,KrishnapuramRoad, Tadipatri, Ananthapuramu Dt, A.P. Have changed my name as KATTUBADI ALLABAKASH,S/o KATTUBADI RAHEEM(NEW Name)

# మట్టి వినాయక విగ్రహాలనే వాడండి

## నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయండి
## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 26, ప్రభాతవార్త

మట్టి వినాయక విగ్రహాలను ప్రజలు వినియోగించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. సోమవారం వినాయక నిమజ్జన ఏర్పాట్లను నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య, పోలీసు, నగర పాలక సంస్థ అధికారులు, తిరుపతి వినాయక నిమజ్జన మహోత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. నిమజ్జనం జరిగే కుంటకు తెలుగు గంగ నీటి ట్రయల్ రన్‌ను నిర్వహించారు. కుంటను పూర్తి స్థాయిలో నీటిని నింపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా వినాయక సాగర్‌కు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. వినాయక విగ్రహాలను సాగర్‌కు తీసుకొచ్చే వాహనాలను వరుస క్రమంలో అనుమతించాలని ఆయన పోలీసులకు సూచించారు. మండపాల వద్ద తగిన భద్రత కల్పించాలని అన్నారు. అలాగే మండపాల నిర్వాహకులు నిర్దిష్ట సమయంలో విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని ఆయన కోరారు. వినాయక మహోత్సవ కమిటీ సూచన మేరకు క్రేన్స్ ఏర్పాటు చేయడంతో పాటు వవిగ్రహాల తరలింపులో వాహనాలు పాడైతే ట్రాఫిక్ జామ్ కాకుండా టోయింగ్ వెహికల్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వినాయక సాగర్ ప్రధాన ద్వారం, పరిసర ప్రాంతాలను వినాయకుని ప్రతిమలు ప్రతిభింబివేలా సీరియల్ లైట్స్‌తో సుందరంగా అలంకరించాలని ఆయన సూచించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసేలా అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని అన్నారు. మూడు రోజులు ముందుగానే కుంటను నీటితో నింపుతామని అన్నారు. మరుగుదొడ్లు కావాలని ప్రజలు అడిగారని, ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. సాగర్‌లో ఉన్న చిన్న, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయం చేసుకుని వినాయక చవితి వేడుకలు విజయవంతం చేయాలని అన్నారు. ప్రజలందరూ పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలు వినియోగించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డిఈలు విజయకుమార్ రెడ్డి, నరేంద్ర, డిఎస్పిలు వెంకటనారాయణ, రామకృష్ణ, సిఐ రామ్ కిషోర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రావు, తిరుపతి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, గుండాల గోపినాథ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు





గూడూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్, రెడ్డి సంస్థ భక్తుల సహకారంతో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గూడూరు పట్టణంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్ని కృష్ణుని బొమ్మల కొలువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. తీన్మార్ తప్పెట్లతో గోపాలకృష్ణుని గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కౌరవ పాండవుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి అన్న ప్రసాదాలు స్వీకరించారు. కృష్ణాష్టమి వేడుకల్లో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని వివిధ వేషధారణలో ఉన్న కృష్ణునితో కలిసి ఫోటో దిగారు.

## దైవాన్ని కూడా రాజకీయానికి వాడిన పెద్దిరెడ్డి

### - తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లాబాబు మండిపాటు



శ్రీకృష్ణజయంతి సందర్భంగా స్వామివారి రథానికి సారధిగా మారిన చల్లాబాబు

పుంగనూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త

దైవాన్ని కూడా రాజకీయానికి వాడుకోవడం మాజీ మంత్రి పెద్దిరెడ్డికే తెలిసిన విద్య అని, గత ఏడాది తాము పుంగనూరులో శ్రీకృష్ణజయంతికి రానీయకుండా పోలీసులతో అడ్డుకునా న్నరని తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లాబాబు మండిపడ్డారు. శ్రీకృష్ణజయంతి సందర్భంగా సోమవారం ఆయన పట్టణంలో ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులతో పట్టణంలో ప్రదర్శన జరిగింది. శ్రీకృష్ణుడి రథానికి స్వయంగా సారధిగా మారిన చల్లాబాబు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకృష్ణ మందిరం వద్ద ఆయన భక్తులనుద్దేశంచి మాట్లాడుతూ శ్రీకృష్ణఆలయాభివృద్ధికి శాయశక్తులా కృషిచే స్తామన్నారు. ఇదే సందర్భంగా గత ఏడాది అధికారం ఉందని విర్రవీగిన పెద్దిరెడ్డి తెలుగుదేశం నాయకు లను కార్యకర్తలను అరెస్టుచేయించారన్నారు. కానీ, నేడు ఉత్సవాలలో పాల్గొనేందుకు రాలేని దుస్థితి ఉందన్నారు. అయితే, తాను పెద్దిరెడ్డిని స్వాగతిస్తానని, ఇకపై ఎపుడూ ఆలయాలను, మసీదు లను, చర్చిలను రాజకీయాలకు వాడుకోవద్దని సూచించారు. దేవుడు అందరివాడని, ఎవరైనా భగవంతుడిని దర్శించుకోవడానికి రావచ్చన్నారు. ఇకపై ఎవరు కూడా ఆలయాలు, మసీదులు, చర్చిలలో ప్రార్ధనా మంది రాలలో రాజకీయాలు చేయకూడదన్నారు. పుంగనూరు పట్టణంలో మేళతాళాలలో మంగళ వాయిద్యాల తో శ్రీకృష్ణ సా ్వమివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. చల్లాబాబు వెంట తెలుగుదేశం నాయ కులు సివిరెడ్డి, పోలీస్‌గిరి, మాధవరెడ్డి, వెంకటమునియాదవ్‌లతో పాటూ పార్టీనాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో భక్తులకు సౌకర్యవంత దర్శనం

### -చక్కగా పోలీసులు క్యూలైన్ల నియంత్రణ



తిరుపతి, ఆగస్ట్ 26(ప్రభాతవార్త):

యుగపురుషుడు శ్రీకృష్ణభగవానుడి జన్మదినం గోకులాష్టమిన తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ ఆలయంలో సోమవారం భక్తులు భారీగా చేరుకుని స్వామివారిని దర్శించు కున్నారు. వేకువజామున నుండే సామాన్య భక్తులతోబాటు విఐపిలు, పాసులు కలిగిన భక్తులు, హరేకృష్ణ భక్తులు పెద్దసంఖ్యలో ఆలయంకు విచ్చేశారు. ఆలయం పరిసరాలు హరేరామహరేకృష్ణ నినాదంతో మార్మోగింది. ఇక్కడ వరుసగా ఆయా నిర్ణీత క్యూలైన్ల వద్ద భద్రత సిబ్బంది, పోలీసులు చక్కగా సేవలం దించి భక్తులను ఆలయంలోనికి అనుమతిం చారు. ఎక్కడా చిన్నపాటి తొక్కిసలాట లేకుండా ప్రశాంతంగా స్వామివారిని దర్శించు కునేలా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ నాగభూషణం, ఈస్టు డిఎస్పీ వెంకటనారాయణ, అలిపిరి సిఐ రామకిశోర్‌లు తమ సిబ్బందితో ప్రణాళిక బద్ధంగా బందోబస్తు నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడి అధికంగా ఉంది. సాయంత్రం మళ్ళీ నగరవాసులేగాక పరిస రాల్లోని ప్రజలు కృష్ణుని దర్శనానికి విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు చక్కటి ఏర్పాట్లుచేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం పరిసరాల్లో ఎస్పీ సుబ్బరాయుడు భద్రతపై తనిఖీ చేశారు. భక్తులకు సాఫీగా దర్శనం చేయించేలా చూడాలని పోలీసులకు సూచించారు.

## శ్రీ కృష్ణుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నా : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 26, ప్రభాతవార్త

శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇస్కాన్ ఆలయాన్ని సందర్శిం చారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ శ్రీ కృష్ణుని ఆశీస్సు లతో తిరుపతి ప్రజలు సుఖసం తోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు చెప్పారు. అలాగే ఇందిరా మైదానంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి యు వత ఏర్పాటు చేసిన ద్వారక మధుర ఆలయ నమూనా రూపంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ ఆలయాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సతీసమేతంగా సందర్శించి దర్శనం చేసుకున్నారు. అన్నా రామచంద్రయ్య, అన్నా అనితలు ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, బడి సుధా యాదవ్, ఆనంద్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, బాబ్జీ, నెలవాయి మురళి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తవణంపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త:

శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు సోమవారం అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని జొన్నగురకల, అరగొండ, మత్యం, ఎం.గొల్లపల్లె, నల్లిశెట్టిపల్లె, నారసింహపల్లె, దిగువమాఘం, వీర్లగుడిపల్లె, తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. అలాగే రాత్రి తనకిష్టమైన గరుడవాహనంపై స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే ప్రతి ఇంటిలోనూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే చిన్నపిల్లలు శ్రీకృష్ణుడు, రాధాదేవి, సత్యభామ వేషదారణలతో ఇళ్ళలో మురిపించారు. ఇదిలా వుండగా మండలంలోని అరగొండలో స్థానిక యాదవ వంశస్థులచే శ్రీకోదండరాముల వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై వుంచి ఊరేగించారు.

**ఐరాలో...**

ఐరాల, ఆగస్టు 26 ప్రభాతవార్త:

శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు సోమవారం అత్యంత భక్తి శ్రద్దలతో వైభవంగా జరుపుకున్నారు. ఈమేరకు మండలంలోని గొల్లపల్లె, జి.మిట్టూరు, కలికిరిపల్లె, ఇరువారపల్లె, ఐరాల, యల్లంపల్లె, ముదిగోళం, నాగంవాండ్లపల్లె, కాణిపాకం తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. మందిరాలను సర్వాంగసుందరంగా అలకంరించి పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాలు, ప్రత్యేకబాణాసంచా పేలుళ్ళ నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అలాగే ప్రతి ఇంటిలోనూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పెద్దపంజాణి, ఆగస్టు 26 ప్రభాతవార్త

మండలంలోని శంకర రాయలపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రతిమను గుట్టూరు, అప్పినపల్లి, శ oకరరాయలపేట పురవీధుల్లో మేళతాళాలు, చెక్కభజనలు, కోలాటలు, డప్పు వాద్యాల నడమ ఊరేగిం చారు. ఈసందర్భంగా దేవర ఎద్దు నృత్యం అలరించింది. ఈసందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలో ్ల కృష్ణాష్టమి సందర్భంగా సందడి కన్పించింది.

## ద్రవిడ వర్సిటీ విసికి పాతూరి నాగభూషణం పురస్కారం



కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి పాతూరి ఫౌండేషన్‌చే పాతూరి నాగ భూషణం పురస్కారాన్ని అందుకు న్నారు. విజయవాడలో ఆంధ్రప్ర దేశ్ లైబ్రరీ అసోసియేషన్ తర పున ఈ పురస్కారాన్ని ఆచార్య దొర స్వామికి పాతూరి ఫౌండేషన్ అధ్యక్షులు కెసి కల్కురా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తూ లైబ్రేరియన్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఆచార్య దొరస్వామి నేడు ద్రవిడ వర్సిటీ ఉపకులపతి స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ఆయన సేవలను గుర్తించి పాతూరి పురస్కారం అందించినట్లు పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న విసి ఆచార్య దొరసా ్వమిని పలువురు అభినందించారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా

# బ్రహ్మోత్సవాల్లో పార్కింగ్ సౌకర్యం

### -గ్యాలరీల్లోకి సాఫీగా ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు : సివిఎస్‌ఓ



తిరుమల, ఆగస్ట్ 26(ప్రభాతవార్త)ప్రతినిధి:

సాధారణరోజుల్లోనే 90వేలమంది వరకు వస్తున్న భక్తుల సంఖ్య అక్టోబర్‌లో జరగ నున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అశేషంగా వచ్చే అవకాశం ఉంది. అంచ నాలకు తగ్గట్లు భక్తులు స్వామివారి వాహన సేవల వీక్షణకు మాఢవీధుల్లోని గ్యాలరీలకు సాఫీగా చేరుకు నేలా ఏర్పాట్లు ఉండాలని టిటిడి సివిఎస్‌ఓ ఎస్. శ్రీధర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో వాహనాలు సరైన ప్రాంతంలో పార్కింగ్ చేసుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిఎన్‌సి టోల్‌గేట్ వద్దకు చేరుకున్న తరువాత భక్తులు వాహనాల్లో ఎటు వెళ్ళాలనే సూచనలు పోలీసు అధికారులు, విజిలెన్స్ సిబ్బంది మర్యాదపూర్వకంగా సూచించేలా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి , టిటిడి విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయంగా వ్యవహరించాలన్నారు. భద్రత పరంగా తీసుకోవాల్సి న జాగ్రత్తలను సోమవారం సివిఎస్‌ఓ శ్రీధర్ , విఎస్‌ఓలు నెట్టంతులనీ వెంకటరావ్‌కుమార్, అల్లంసురేంద్ర, నందకిశోర్, ఏవిఎస్‌ఓలు సాయిగిరిధర్, మనోహర్, ఇంజనీరింగ్ అధికారులు సుబ్రమణ్యం, సుదాకర్‌తో కలసి సోమవారం ఉదయం ఆలయం ముందుభాగం, ఆలయ పరిసరాలు, మాఢవీధుల్లోని గ్యాలరీలు, ప్రవేశనిష్క్రమణ ద్వారాలు పరిశీలించారు.

## ఇస్రో మిడిల్ లెవల్ మేనేజర్లకు శిక్షణ

### - షార్‌లో వారంరోజుల పాటు కార్యక్రమం






శ్రీహరికోట (తడ), ఆగస్టు 26 ప్రభాతవార్త

మానవ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వారంరోజుల పాటు సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో స్ట్రక్చర్డ్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాల్లో ఈ శిక్షణా తరగతులు మొదలయ్యాయి. ఇస్రోలో వివిధ రకాల ప్రాజెక్టులు రూపొందుతున్నాయని, వాటిని ఏ విధంగా జరపాలన్న అంశం మీద ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ పేర్కొన్నారు. వివిధ ఇస్రో కేంద్రాల నుంచి 40 మంది మిడిల్ లెవల్ మేనేజర్లకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ముఖ్య అతిథిగా యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ ఎం.శంకరన్ పాల్గొన్నారు. ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తలు, ఇండస్ట్రీ నిపుణులు, అకడమిక్ నిపుణులు, వివిధ ప్రాజెక్టుల మేనేజ్‌మెంట్ ఇంజినీర్లకు శిక్షణ ఇస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంపిసి డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు, అసోసియేట్ డైరెక్టర్ ఎ.సయ్యద్ హమీద్, ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీల్లో

### శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ




శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ టోర్నమెం ట్‌లో శ్రీకాళహస్తి విద్యార్థులు తమ సత్తా చాటారు. సింహపురి కరాటే అకాడమీ కోచ్ కె.ధనుష్‌ను పలువురు అభినందించారు. ఆదివారం కర్ణాటక ఇంటర్నేషనల్ రాష్ట్రం లోని శివమొగ్గ పట్టణం నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. కరాటే ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ శివమొగ్గ సిటీ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ ఆధ్వర్యంలో జరిగింది. కరాటే ఛాంపియన్ షిప్ టెర్నమెంట్‌లో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన సింహపురి కరాటే అకాడమీ కోచ్ కె.ధనుష్ ఆధ్వర్యంలో 5మెడల్స్ సాధించారు. ఎం.ప్రఖ్యాత 25కేజీల విభాగంలో బంగారు పతకం గెలుపొందగా 35కేజీల క్లారీస్ కేజీల బంగారు పతకం , అలాగే 28 కేజీల విభాగంలో నమస్వీ బంగారు పతకం, 27కేజీల విభాగంలో కుశాంత్కుమార్ వెండిపతకం, 21కేజీల విభాగంలో తన్విశ్రీ వెండిపతకంను గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ పిఎర్రేమార్లే యుఎస్‌ఏ మీదుగా మెడల్స్

# వాడ వాడల్లో కృష్ణాష్టమి వేడుకలు: పరవశించిన భక్త జనం





శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని వాడ వాడల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓ వైపు శ్రీకాళహస్తీశ్వరాలయం మరో వైపు యాదవ సంఘాలు వాడ వాడల్లో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పట్టణంలో భారీ ఎత్తున శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను యాదవ సంఘ నాయకులు చెంచురత్నం యాదవ్, రామకృష్ణయాదవ్, కృష్ణయాదవ్, రమణయ్య యాదవ్, కృష్ణయాదవ్, బాలు యాదవ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డులోని శ్రీకృష్ణుని ఆలయంలో గోకులాష్టమి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారితోపాటు మాజీ చైర్మెన్ శ్రీనివాసులు ఆయన అనుచరులు స్వామిని దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం గోకులాష్టమి సందర్భంగా 'సప్త గోకులంలో' సంప్రదాయ పద్దతిలో పూజలు నిర్వహించారు. గోకులంలో మధ్య శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించి ఉన్నారు. ఇక్కడ ఆలయ ఇఒ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి ఆదేశాలతో ఆయన అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ పొరోహితులు అర్ధగిరి స్వామి ప్రత్యేకంగా అలంకారాలుజరిపారు. పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్ వారి సహాచరులు పాల్గొన్నారు., అలాగే లోబావిలోని దేవస్థానంకు అనుబంధంగా ఉన్న భరద్వాజ తతీర్థంలోని గోశాలలో గోకులాష్టమని సందర్భంగా గోవులకు అరటి పండ్లను అందించారు. ఈ కార్యక్రమాల్లో గోశాల ఇన్‌చార్జి ఎకే దనపాల్ వారి సహాచరులు ఎపాల్గొన్నారు.

**శ్రీకృష్ణుని గుడిలో...**

శ్రీకాళహస్తిలోని శ్రీకృష్ణుని గుడిలో సోమవారం గోకులాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి నాల్గవ గేట్ ఎదురుగా వెలసిన శ్రీకృష్ణుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు మాజీ కౌన్సిలర్ రవి సారధ్యంలో ఏర్పాటు చేసారు. మధ్యాహ్నం ఇక్కడ వేలాది మందికి భోజనం వసతి కల్పించారు.

## అలరించిన శ్రీకృష్ణులు, గోపికలు



శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు భానుశ్రీనివాస్‌కుమార్, తరుణ్‌కృష్ణ, చేతన్‌సాయి, కిషన్‌సాయి

శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీ సమీపంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయంలో సోమవారం భక్తజనసంద్రంతో నిండిపోయింది. ఈనేపథ్యంలోపలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం చిన్నారులు భానుశ్రీనివాస్‌కుమార్, తరుణ్‌కృష్ణలు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించగా పలువురు గోపికల వేషధారణలలో ఆకట్టుకున్నారు. కాగా ఉత్సవమూర్తి ముందు చిన్నారుల నృత్యప్రదర్శన సాగింది.